# 5

# క్రీస్తు ద్వారా సమాధానము

## కొలొస్సయులకు 1:21-23

21 మొదలుకొని 23 వరకు గల వచనములలో, కొలొస్సయులు అదివరకు కోల్పోయిన పరిస్థితి గూర్చి పౌలు చర్చించాడు. వారు యేసు క్రీస్తు మరణము ద్వారా సమాధానపరచబడినందున, విశ్వాసమందు స్థిరముగా నిలిచియున్నట్లయితే వారు దేవుని యెదుట పరిశుద్ధులుగాను నిర్దోషులుగాను నివేదింపబడుదురు.

### వారి పూర్వ స్థితి (1:21)

**[21]మరియు గతకాలమందు దేవునికి దూరస్థులును, మీ దుష్క్రియల వలన మీ మనస్సులో విరోధ భావము గలవారునై యుంటిరి.**

**"గతకాలమందు దేవునికి దూరస్థులును, మీ దుష్క్రియల వలన మీ మనస్సులో విరోధభావము గలవారనై యుంటిరి" (1:21)**

పౌలు మొదట వారి పూర్వపు స్థితిని ఈ క్రింది విధంగా వర్ణించాడు: మరియు **గతకాలమందు దేవునికి దూరస్థులును, మీ దుష్క్రియలు వలన మీ మనస్సులో విరోధభావము గలవారునై యుంటిరి**. ఈ వచనములో మినహాయించి, "దూరస్థులై యుంటిరి" (*apallotrioō*) అను పదజాలము ఎఫెసీయులకు 2:12 మరియు 4:18లో మాత్రమే అగుపించుచు, అచ్చట "వేరుపరచబడి యుంటిరి" అని అనువదింపబడి యున్నది. ఎఫెసీయులకు పత్రికలో అది ప్రత్యేకంగా అన్యజనులకు అన్వయింపబడుచున్నది, కానీ ఇచ్చట దాని అన్వయము విశాలమైనదై కొలొస్సయుల సహవాసము లోపలనే నానావిధ నేపథ్యములు గలవారికి వర్తించుచున్నది (కొలొస్సయులకు 3:11). "విరోధభావముగలవారు" (*echthros*) అను పదము "శత్రువులు" (మత్తయి 5:43) అని అతి తరుచుగా అనువదింపబడుచున్నది. గతంలో, కొలొస్సయులు దేవునికి దూరస్థులై యుండిరి. వారి మనస్సులు ఆయన యెడల శత్రుభావము కలిగియుండినవి – అది దేవుని కోరికనుబట్టి కాదు, కానీ దేవునికి విరోధముగా వారు చూపించిన వారి సొంత తిరుగుబాటుతనమునుబట్టియే.

వారు ఇతరులందరి వలెనే (రోమీయులకు 3:23), పాపము వలన (యెషయా 59:1, 2) దేవుని నుండి వేరుపరచబడినవారై పాపిష్ఠి పనులలో నిమగ్నమై యుండునట్లు వారి వైఖరే వారికి మార్గము సుగమంచేసింది. వారి మనస్సులు తిరుగుబాటుతనము గలవైనందున, వారు దేవునికి దూరమయ్యారు, ఆయన వారికి దూరమగుటకు కారకులయ్యారు. దైవభక్తిలేని ఆలోచనా ధోరణి ధిక్కారముతో కూడిన చర్యలకు దారితీస్తుంది. దాని పర్యవసనమేమనగా, దేవుని యెడల వైరభావముతో ప్రవర్తించు వారి పట్ల దేవుడు వైరభావముతో ప్రతికూలముగా ప్రతిస్పందించును (లేవీయకాండము 26:21, 23, 24, 27, 28, 40, 41). ప్రాపంచీక

మనస్తత్వము యేసు క్రీస్తు సాధ్యంచేసిన సమాధానపరచబడుటను అంగీకరించుటలో కష్టము కలిగిస్తుంది.

అర్థంచేసికొనుటకును, ఆలోచించగలుగుటకును "మనస్సు" (*dianoia*) మూలాధారమని యోచించవలెను. అది కొన్ని పర్యాయములు *kardia*కు (హృదయమునకు) పర్యాయపదమై యుండును, అది మంచి లేక చెడు కార్యములకు మూలమై యుండగలదు. చెడుకార్యములు చెడు ఆలోచనలతో సంబంధము కలిగియుండును (ఆదికాండము 8:21; కీర్తనలు 10:3, 4).

దేవుడున్నాడని రుజువుచేయుటకు అన్యజనుల యొద్ద చాలినంత రుజువుండినప్పటికిని, దేవుని గూర్చిన వాస్తవమును అంగీకరించుటకు వారు తృణీకరించారు (రోమీయులకు 1:19, 20). వారు బుద్ధిపూర్వకంగానే దేవుని తృణీకరించారు (రోమీయులకు 1:28). పౌలు యీలా వ్రాయుచున్నాడు,

> కాబట్టి అన్యజనులు నడుచుకొనునట్లు మీరికమీదట నడుచుకొనవలదని ప్రభువునందు సాక్ష్యమిచ్చుచున్నాను. వారైతే అంధకారమైన మనస్సుగలవారై, తమ హృదయ కాఠిన్యము వలన తమలోనున్న అజ్ఞానముచేత దేవునివలన కలుగు జీవములోనుండి వేరుపరచబడినవారై, తమ మనస్సునకు కలిగిన వ్యర్థత అనుసరించి నడుచుకొనుచున్నారు (ఎఫెసీయులకు 4:17, 18).

వారు చెడ్డవారయ్యారు ఏలయనగా వారి ఆలోచనలలో నుండి వారు దేవునిని మినహాయించారు (రోమీయులకు 1:28–32).

దుష్క్రియలు చేయువారు దేవునికి శత్రువులై యున్నారు. "వ్యభిచారిణులారా, యీ లోకస్నేహము దేవునితో వైరమని మీరెరుగరా? కాబట్టి యెవడు ఈ లోకముతో స్నేహము చేయగోరునో వాడు దేవునికి శత్రువగును" అని యాకోబు రచించాడు (యాకోబు 4:4). "యేసు క్రీస్తు బలియాగము ద్వారా ఆయన శత్రువులు సమాధానపరచబడిన యెడల, సమాధానపరచబడినవారమై, ఆయన జీవించుట చేత మరి నిశ్చయముగా రక్షింపబడుదుము" (రోమీయులకు 5:10).

సమాధానపరచబడుటకు గల అవసరము దేవుడు పాపమును మరియు తిరుగుబాటుతనమును ద్వేషిస్తాడను వాస్తవముపై ఆధారపడియున్నది (కీర్తనలు 5:5; 11:5; సామెతలు 6:16, 19; యిర్మీయా 12:8; హెబ్రీయులకు 1:9). దేవుని చిత్తమును తృణికరించుటకు దుష్క్రియలు చేయువారు మొండిపట్టుతో కొనసాగినట్లయితే, ఆయన వారిని ద్వేషించుచు మరి యిక ఎన్నడను వారిని ప్రేమించడు (హోషేయ 9:5). యేసుకు లోబడక ఆయన సత్యమును అనుసరించని వారిమీద ఆయన ఉగ్రత నిలచియుండును (యోహాను 3:36; రోమీయులకు 1:18; 2:5, 8–9; ఎఫెసీయులకు 5:6–7; కొలొస్సయులకు 3:6).

పాపము శిక్షింపబడవలెనని దేవుని న్యాయము కోరుచున్నది. ఈ అవసరము క్రీస్తు మరణము ద్వారా తీర్చబడినది కాబట్టి, యేసుకు లోబడువారిని అంగీకరించుటకు దేవుడు సర్వసిద్ధమై యున్నాడు (హెబ్రీయులకు 5:9–10). పాపులను ఆయనతోనే సమాధానపరచుటకు దేవుడు తన వంతు భాగము చేసాడు కాబట్టి, ఇప్పుడు వైరభావముతో కూడిన వారి వైఖరిని వారు మార్చుకొని సమాధానమును వెదకి వెంటాడవలసిన అవసరం ఎంతైనా ఉన్నది.

## యేసుక్రీస్తు మరణము ద్వారా వారు సమాధానపరచబడుట (1:22)

**[22]తన సన్నిధిని పరిశుద్ధులుగాను నిర్దోషులుగాను నిరపరాధులుగాను నిలువబెట్టుటకు ఆయన మాంసయుక్తమైన దేహమందు మరణము వలన ఇప్పుడు మిమ్మును సమాధానపరచెను.**

### "ఆయన మాంసయుక్తమైన దేహమందు మరణము వలన ఇప్పుడు మిమ్మును సమాధానపరచెను" (1:22)

కొలొస్సయులు దేవుని యెడల వారి మనస్సుల్లో వైరభావముగలవారై యుండినందు వలన ఆయన ఉగ్రత వారిపై ఉండినప్పటికిని, యేసు తన మరణము ద్వారా స్నేహమును సాధ్యం చేసాడు. **అట్లయినను ఆయన మాంసయుక్తమైన దేహమందు మరణము వలన ఇప్పుడు మిమ్మును సమాధానపరచెను** అని పౌలు పలికాడు. ఈ తలంపు 20వ వచనములోని ఒక పదజాలమునకు సంబంధించినదై యున్నది: "ఆయన సిలువ రక్తముచేత సంధిచేసెను."

యేసుక్రీస్తు మరణము ద్వారా రెండు సంగతులు సమకూర్చబడ్డాయి: (1) సమాధానపరచబడుటను నిరోధించుచుండిన పాపమను అడ్డంకిని ఆయన తొలగించాడు, మరియు (2) ఆయన కనికరము మరియు ప్రేమ ద్వారా, వైరభావముతో నిండియుండిన మనస్సు గలవారు దేవునికి అంకితము చేసికొనిన అనురాగసహిత స్నేహితులగునట్లు వానికి ఆయన సమకూర్చాడు. ఆయన సిలువపై మరణించుట ద్వారా యేసు ప్రదర్శించిన సున్నితమైన తాపత్రయము తిరుగుబాటుతనముగల మానవ జాతి హృదయములను తాకి వారిని మార్చజాలనట్లయితే, బహుశా మరేదైనను వారిని దేవునికి స్నేహితులనుగా చేయజాలదు. ఇంత కంటె తక్కువైన ప్రేరేపణతో, తన కుమారుడైన ఇస్సాకును బల్యర్పణ గావించుటకు ఇష్టపడుట ద్వారా దేవుని యెడల విశ్వాససహితమైన విధేయత చూపిన అబ్రాహాము దేవుని స్నేహితుడని సంబోధింపబడ్డాడు (యాకోబు 2:22, 23).

అత్మస్వరూపిగా, యేసు పాపప్రాయశ్చిత్తార్థమైన బల్యర్పణ కాలేకపోయాడు. మానవుడు ఒక శరీరమును మాత్రమే చంపగలడు (మత్తయి 10:28 చూడుము). గనుక ఆయన మన పాపముల నిమిత్తము మృతిచెందునట్లు యేసు మానవ శరీరమును ధరింపవలసివచ్చినది (హెబ్రీయులకు 10:5). జంతువుల బల్యర్పణ, అది పాపములను తీసివేయలేకపోయినది, గనుక అది కేవలము యేసు మరణమునకు ఒక ముందుఛాయయై యుండినది (హెబ్రీయులకు 10:1-4). ఆయన శరీరము మృతిచెందుట ద్వారా, మనము దేవుని సన్నిధిలోనికి సులభముగా ప్రవేశించుటకు యేసు మార్గమును సుగమం చేసాడు (హెబ్రీయులకు 10:19, 20).

"రక్తమాంసములతో కూడిన శరీరము" (*to sōma tēs sarkos,* "రక్తమాంసములు గల దేహము") అను పదములు యేసు శరీరధారియై ఈ లోకమునకు వచ్చాడని ఒప్పుకొనని క్రీస్తువిరోధుల సిద్ధాంతమునకు (2 యోహాను 7 వచనం) సమాధానమిచ్చుచున్నవి. యేసు సంపూర్ణముగా ఆత్మయై యుండెను గనుక ఆయన ఎన్నడును మానవ శరీరముతో జీవించలేదని జ్ఞానతత్వవాదులు తర్కించారు. దేవుడైయున్నవాడు మానవ శరీరమునందు నివాసమేర్పరచుకొనుట సంభావ్యమై యుండదు గనుక, భౌతికమైన పదార్థము దేవుని స్వభావమునకు పూర్తిగా విరుద్ధమైనదైయున్నదని వారు ఉపదేశించరు. జ్ఞానతత్వవాదుల

ఉపదేశకులు బోధించుచుండిన అబద్ధములు తప్పని క్రైస్తవులు నిరూపించునట్లు, పరిశుద్ధాత్మ, పౌలు ద్వారా, వారిని సిద్ధపరచుచుండవచ్చును (1 తిమోతి 4:1). కొలొస్సయులకు 2:11లో శరీరము గూర్చి ఈ అపొస్తలునికి చెప్పుటకు యింకా ఎంతో ఎక్కువ ఉంది.

సన్మార్గదూరమైన తనయుడై యుండి తన తండ్రితో సమాధానపడిన కుమారుని గూర్చి యేసు ఒక ఉపమానము ప్రబోధించాడు. వారు తన తండ్రి ఇంటిని వదలిపెట్టి వెళ్లిపోయాడు, వాడు తీసికొనివెళ్లిన స్వాస్థ్యమంతటితో (తన తండ్రి పొదుపుచేసిన దానిలో సగభాగముతో) దుర్వ్యాపారముచేసి పాడుచేయుట ద్వారా పరలోకమునకును తన తండ్రికిని విరోధముగా పాపము చేసాడు. ఇలా చేయుట వలన, వాడు తన తండ్రి యెడల తప్పిదము చేయుట మాత్రమే కాదు గాని వాడు తనను తాను తన తండ్రి నుండి వేరుచేసికొన్నాడు. అట్లయినప్పటికిని, తిరిగి వచ్చిన కుమారున్ని తిరిగి చేర్చుకొనుటకు తన తండ్రి ఇష్టపడుచుండెను. తండ్రి కుమారుని యొద్దకు వెళ్లలేదు; కానీ, కుమారుడే తండ్రి యొద్దకు తిరిగి రావలసివచ్చినది (లూకా 15:11–24). తండ్రి తనయుల మధ్య సమాధానమేర్పడినది, తండ్రి ఇంటి యొద్దనే.

ఇదే విధముగా, పాపము చేసిన మానవ జాతి దేవుని నుండి వేరైనది. గనుక యేసు లోక పాపములను తానే భరించి మానవాళిని తండ్రితో సమాధానపర్చబడుటను సాధ్యంచేసాడు (1 పేతురు 2:24). యేసు శరీరధారిగా మరణించుట ద్వారా, దేవుడు సమాధానపర్చబడుటను సాధ్యంచేసాడు; కానీ దేవునితో సమాధానపరచబడునట్లు మానవజాతి దేవునిని కలిసికొనవలసినది క్రీస్తునందే.

“దేవుడు వారి అపరాధములను వారి మీద మోపక, క్రీస్తునందు లోకమును తనతో సమాధానపరుచుకొనుచు, ఆ సమాధాన వాక్యమును మాకు అప్పగించెను” అని పౌలు కొరింథులో నున్న విశ్వాసులకు రచించాడు (2 కొరింథీయులకు 5:19). ఆ సహోదరులు దేవునితో సమాధానపడవలెనని ఆయన వారిని మందలించాడు (వచనం 20). దేవుడు మన పాపములను క్షమించుటకు క్రీస్తునందు వేచియున్నాడు. దేవునితో సమాధానపరచబడుట క్రీస్తునందే సాధ్యమౌతుంది; అది క్రీస్తునకు వెలుపల కలుగునని ఎన్నడును ఉపదేశింపబడలేదు. మనము దేవునితో సమాధానపరచబడునట్లు దేవుడు చేయవలసిన దానిని యేసు అదివరకే సమాప్తము చేసాడు. ప్రజలు దేవునితో సమాధానపరచబడునట్లు క్రీస్తులోనికి ప్రవేశించవలసి యున్నది గనుక ఇప్పుడు వారు వారి వంతు చర్య తీసికొనవలసి యున్నది. దేవుడు మరియు మానవుడు సామరస్యపూరిత స్నేహముతో కలిసికొనగల చోటు ఇదే. ఒకడు బాప్తిస్మము ద్వారా క్రీస్తులోనికి ప్రవేశించగలడు (రోమీయులకు 6:3; గలతీయులకు 3:26, 27).

### “తన సన్నిధిని పరిశుద్ధులుగాను నిర్దోషులుగాను నిరపరాధులుగాను నిలువబెట్టుటకు” (1:22)

యేసు సిలువపై మరణించుటలో గల ఉద్దేశమును: **తన సన్నిధిని పరిశుద్ధులుగాను నిర్దోషులుగాను నిరపరాధులుగాను నిలువబెట్టుటకు** అని చెప్పుచు పౌలు దానిని సవివరంగా తెలియజెప్పాడు. సమస్త పాపములు తొలగింపబడునట్లు ఆయన శరీరము బల్యర్పణ గావింపబడుట ద్వారా, కొలొస్సయులు పరిశుద్ధులుగాను, నిర్దోషులుగాను నిరపరాధులుగాను నిలిచియుండునట్లు యేసు సాధ్యంచేసాడు. ఆయన వారిని పాపపు డాగులేవియును

లేకుండా తన యెదుట నివేదించగలుగునట్లు వారిని సమాధానపర్చాడు. యేసు యెదుట నివేదింపబడనైయుండినవారు నిర్మలము చేయబడిన స్థితిని ఉద్ఘాటించి చెప్పుటకు పౌలు మూడు విశేషణములను ప్రయోగించాడు:

1. "పరిశుద్ధులు" (*hagioi*) అను పదము శుద్ధత గూర్చిన ఒక నిశ్చయాత్మకమైన స్థితియై యున్నది. కొలొస్సయులు లోకములోని దుష్టులైనవారి నుండి వేరుగా నుండు ఏర్పాటును ఈ లక్షణము కలుగజేసినది. ఇదే పదము కొలొస్సయులకు 1:1లో "పరిశుద్ధులు" అని అనువదింపబడినది.
2. "నిర్దోషులు" (*amōmoi*) అనగా, కొలొస్సయులు యేసు యెదుట మచ్చలేనివారుగాను, దోషరహితులుగాను, డాగులేనివారుగాను నివేదింపబడుదురని అర్థము. వారిలో ఎటువంటి పొరపాటైనను కనుగొనబడకుండునట్లు వారు యేసు రక్తము చేత పవిత్రము చేయబడియున్నారు. సంఘము యేసు రక్తము చేత శుద్ధీకరింపబడి పవిత్రము చేయబడినదని సూచించుటకు *Amōmoi* ఉపయోగింపబడినది (ఎఫెసీయులకు 5:26, 27; ఎఫెసీయులకు 1:4; యూదా 24; ప్రకటన 1:5 కూడ చూడుము). ఇంకా, హెబ్రీయులకు 9:14లోను 1 పేతురు 1:19లోను అది యేసును సూచించుచున్నది. అక్కడ ఆయన బల్యర్పణ నిమిత్తమైన నిష్కళంకమైన గొఱ్ఱెపిల్లతో పోల్చబడియున్నాడు. ఈ పదము క్రొత్త నిబంధనలో మరెక్కడను కనిపించదు.
3. "నిరపరాధులు" (*anegklētoi*) అనగా, వారికి విరోధముగా అపరాధమునకు సంబంధించిన ఏ నిందయైనను మోపబడజాలదు, ఏలయనగా యేసు వారి పాపపు డాగులను నిర్మూలించుచు వారిని తన స్వరక్తము చేత వారిని సమాధానపర్చాడని అర్థము. క్రొత్త నిబంధనలో ఈ పదమును పౌలు మాత్రమే ప్రయోగించాడు. ప్రభువు దినాన వారు నిందారహితులని యేసే వారిని నిర్ధరించునని ఆయన కొరింథీయులకు అభయమిచ్చాడు (1 కొరింథీయులకు 1:8). సంఘ పెద్దలుగా లేక పరిచారకులుగా సేవ చేయుటకు ఎన్నుకొనబడినవారు వారికి విరోధముగా ఎటువంటి నిందయైనను లేనివారై యుండవలసినదే (1 తిమోతి 3:10; తీతు 1:6, 7).

సమాధానపరచబడుట యేసు రక్తము చేత సమకూర్చబడినది గనుక ఈ మూడు పదములు దేవుని దృష్టిలో "పాపరాహిత్యము" అను ఒకే అభిప్రాయమును వ్యక్తముచేయుచున్నవి. యేసు పవిత్రపరచి దానిని నిష్కళంకమైనదానిగా చేసిన సంఘము ఆయన తన యెదుట నిలువబెట్టుకొనువారితో నిండియున్నదని పౌలు ప్రకటించాడు (ఎఫెసీయులకు 5:25-27).

పాపిష్ఠి పనుల వలన, ఏ ఒక్కడును నీతిమంతుడు కాడు (రోమీయులకు 3:9, 10); దేవుని దృష్టిలో, ఏ ఒక్కనిలోను వ్యక్తిగత పరిశుద్ధత, నిందారాహిత్యము, లేక నిరపరాదత్వము లేదు. ఇవన్నియును యేసు క్రీస్తు చేసిన కార్యము ద్వారానే కలుగును. ఇదే అభిప్రాయమును పౌలు ఎఫెసీ పత్రికలో (1:4 మరియు 5:27) అభివ్యక్తము చేసాడు. ప్రజలను దేవునితో సమాధానపరచబడినవారిగా చేయునది యేసు రక్తము చేత పవిత్రము చేయబడుచున్నది; పవిత్రము చేయబడినవారు యిక నుండి ఏమాత్రమును దోషులు కారు. నిశ్చయాత్మకముగా చెప్పుకొంటే, విశ్వాసులైనవారు ఆయన యెదుట "పరిశుద్ధులు"గా నివేదింపబడునట్లు వారి నిమిత్తము యేసు సాధ్యతను సమకూర్చాడని చెప్పుకొనవచ్చును; వ్యతిరేకార్థకంగా చెప్పుకొంటే, ఆయన వారిని "నిర్దోషులను" మరియు "నిరపరాధులను" చేయగలడు. పాపులు యిసుమంతైనా దోషము లేకుండునట్లు వారు కడుగబడగలరు. ఇది అగత్యమైయున్నది ఏలయనగా

పాపములోనే ఉన్నవాడెవడైనను (యోహాను 8:21) మరియు అపవిత్రుడైనవాడెవడైనను (ప్రకటన 21:27) పరలోక రాజ్యములో ప్రవేశింపనేరడు.

ధర్మశాస్త్రము (మోషే ప్రాతినిధ్యం వహించినది; యోహాను 5:45) దానిని ఉల్లంఘించినవారిపై నింద మోపి వారిని శాపగ్రస్తులనుగా చేసినది (గలతీయులకు 3:10). యేసును తృణీకరించువారికి ఆయన వాక్యము తీర్పు తీర్చును (యోహాను 12:48). యేసు రక్తము చేత కడుగబడినవారికి విరోధము ఏ నిందయు నిలిచియుండదు మరియు వారిపై అపరాధము మోపువాడును లేడు. దేవుడు వారిని నిందించడు. ఏలయనగా వారు యేసు రక్తము చేత ఆయనతో సమాధానపరచబడ్డారు. యేసు వారిని నిందించడు. ఏలయనగా ఆయనే వారి పాపములను భరించాడు. సాతాను కూడ వారిని నిందించజాలడు, ఏలయనగా వాడు ఓడింపబడ్డాడు (ప్రకటన 12:10). వారి మనసాక్షులు సహితము వారిని ఖండించజాలదు, ఏలయనగా వారు బాప్తిస్మము చేత (1 పేతురు 3:21) పవిత్రపరచబడ్డారు (హెబ్రీయులకు 9:14; 10:22). వారిపై నిందమోపువారెవరును లేకపోవుటనుబట్టి, వారు నిరపరాధులుగా నిలిచియుందురు.

విధేయత ద్వారా కలుగు పవిత్రత (1 పేతురు 1:22-23) బాప్తిస్మము సమయంలో సమస్త పాపములు కడుగబడినవి (అపొస్తలుల కార్యములు 2:38; 22:16) గనుక అప్పుడది ఒక్కసారే సంభవించిన సంఘటనగా మొదలౌతుంది. ఈ పవిత్రత వెలుగులో నడుచుకొనుచు దేవుని యెదుట వారి పాపములను ఒప్పుకొనుచుండు వారి విషయంలో కొనసాగుచుండును (1 యోహాను 1:7-9). విశ్వాసములో కొనసాగుచుండువారు ఏకదాటిగా పవిత్రము చేయబడుచుందురు గనుక, వారు తీర్పు దినాన యేసు యెదుట నివేదింపబడినప్పుడు నిరపరాధులుగా నిలువబడుదురు.

యేసు సిలువపై ఒక్కసారే బలియాగము చేయుట ద్వారా ఈ క్షమాపణను సమకూర్చాడు (హెబ్రీయులకు 7:27; 9:26-28; 10:10-12, 14). గనుక ఆయన మన పాపముల నిమిత్తము బల్యర్పణగా తనను తాను పలుమార్లు అర్పించుకొనవలసిన అవసరంలేదు. పాప ప్రాయశ్చిత్తార్థ బలిని యేసు ఒక్కసారే సమాప్తము చేసిన తరువాత, ఆయన కూర్చుండియున్నాడు. చేయుటకు ఆయనకు అప్పగింపబడిన పనిని ఆయన సమాప్తము చేసాడు, గనుక ఆయన కూర్చుండగలడు, ఆయన మరలా లేచి తనను తాను బల్యర్పణ గావించుకొనవలసిన అవసరము లేదు.

తీర్పు తీర్చుటకు సింహాసనాసీనుడైయున్నవాడు యేసే (మత్తయి 25:31, 32; అపొస్తలుల కార్యములు 17:31; 2 కొరింథీయులకు 5:10; 2 తిమోతి 4:1). ఆయన రక్తము చేత కడుగబడినవారికి విరోధముగా ఏ నిందయు మోపబడదు. ఏలయనగా వారు ఆయన దృష్టికి నిర్మలులై యున్నారు, గనుక వారు యేసు యెదుట నిష్కళంకులుగా నిలువబెట్టబడుదురు.

## వారు తమ విశ్వాసమందు నిలిచియుండవలెను (1:23)

**23పునాది మీద కట్టబడినవారై స్థిరముగా ఉండి, మీరు విన్నట్టియు, ఆకాశము క్రింద ఉన్న సమస్త సృష్టికి ప్రకటింపబడినట్టియు ఈ సువార్త వలన కలుగు నిరీక్షణ నుండి తొలగిపోక, విశ్వాసమందు నిలిచియుండిన యెడల ఇది మీకు కలుగును. పౌలను నేను ఆ సువార్తకు**

**పరిచారకుడనైతిని.**

**పునాది మీద కట్టబడినవారై స్థిరముగా ఉండి, ... ఈ సువార్త వలన కలుగు నిరీక్షణ నుండి తొలగిపోక, విశ్వాసమందు నిలిచియుండిన యెడల (1:23)**

మనము దేవుని యెదుట "పరిశుద్ధులముగాను నిర్దోషులముగాను మరియు నిరపరాధులముగాను" ఈ జీవితకాలములో నిలువబెట్టబడజాలము. అట్టి సంభవము విశ్వాసమందు స్థిరముగా నిలిచియుండువారి కొరకు మాత్రమే నియమింపబడినది: **పునాది మీద కట్టబడినవారై స్థిరముగా ఉండి, ... ఈ సువార్త వలన కలుగు నిరీక్షణ నుండి తొలగిపోక, విశ్వాసమందు నిలియియుండవలెను.** (గ్రీకులో రెండు పదములై యున్న *tē pistei,* "విశ్వాసమందు" అను పదజాలములో, "విశ్వాసము" అను పదము సంప్రదానర్థకమైన విభక్తిలోనున్నది. "కొనసాగుచుండు" అను విషయమును తెలియజెప్పుటకు "అందులో" అను పదము కలుపబడవలసి యున్నది.)

దేవుని యెదుట నిర్దోషులముగా నిలువబెట్టబడుట షరతుతో కూడినదై యున్నది. ఇది గ్రీకు భాషలోని *ei* ("*if,* యెడల") చేత వ్యక్తము చేయబడుచున్నది. దేవుని యెదుట నిర్దోషులుగా నివేదింపబడువారు, విశ్వాసములో స్థిరముగా కొనసాగుచుండువారై యున్నారు. ఒక్కసారి విశ్వసించుట చాలదు. మనము విశ్వాసములో కొనసాగుచున్నట్టయితే, యేసు చేత పవిత్రులముగా చేయబడినవారి వలె నివేదింపబడుదుము. "సత్ క్రియను ఓపికగా చేయుచు, మహిమను ఘనతను అక్షయతను వెదకువారికి" నిత్య జీవము అనుగ్రహింపబడును (రోమీయులకు 2:7). పాపము గూర్చి నింద లేకుండా ఆయన యెదుట నిలువబెట్టబడువారు, విశ్వాసము ద్వారా యేసును వెంబడించుటకు మొదలుపెట్టి దానియందు కొనసాగుచుండువారై యున్నారు.

> చదువరులు తప్పులు చేయకుండా ఉండలేనివారై యున్నారనుట 23వ వచనములో గల హెచ్చరిక చేత కూడ సూచింపబడుచున్నది; వారు విశ్వాసమందు స్థిరముగా వేరుపారినవారై యుండి సువార్త వలన కలుగు నిరీక్షణ గూర్చి సంకల్పశుద్ధితో సమర్పించుకొన్నవారై యుండుట వారి రక్షణకు సంబంధించిన ప్రాథమిక షరతై యున్నది (1:5తో పోల్చి చూడుము) ... .[1]

తీర్పు దినాన, విమోచింపబడినవారి పాపములు పేర్కొనబడవు. ఎందుకనగా దేవుడు పాపములను క్షమించాడంటే, వాటిని ఆయన యిక ఎన్నటికిని జ్ఞాపకము చేసికొనడు (హెబ్రీయులకు 8:12). యేసుతో కూడ వెలుగులో నడుచుకొనుచు, పాపములను ఒప్పుకొనుచుండుటలో గల గొప్పతనమేమనగా అట్టి వారిని ఆయన రక్తము ఎడతెరిపిలేకుండా కడుగుచునే యుండును (1 యోహాను 1:7-10).

"*If,* యెడల" అని వ్రాయుట ద్వారా, విశ్వాసమందు స్థిరులుగా కొనసాగుచుండనివారు పరిశుద్ధులు, నిర్దోషులు మరియు నిరపరాధులుగా నిలువబెట్టబడరని పౌలు భావించాడు. "విశ్వాసమందు నిలిచియుండుము" అని చెప్పుటలో, స్వధర్మ భ్రష్టత సాధ్యమగుననుట సత్యమే అని అర్థము. ఆయన యందు గల విశ్వాసమునుబట్టి క్రీస్తు నందు కొనసాగుచుండువారు, దేవుని యెదుట నిలువబెట్టబడినప్పుడు ఆయన చేత అంగీకరింపబడువారై యున్నారు.

వారు విశ్వాసమందు నిలిచియుండిన యెడల, కొలొస్సయులు "కట్టబడినవారును," "స్థిరులును," మరియు "సువార్త వలన కలుగు నిరీక్షణ నుండి తొలగిపోనివారునై" యుందురు. "విశ్వాసము" క్రీస్తు ఉపదేశమై యున్నది.[2] మన లక్ష్యము, సహితము, పౌలు పర్ణించుచున్నట్లు విశ్వాసమందు స్థిరముగా నిలిచియుండవలెననుదై యుండవలెను.

"కట్టబడినవారు" (*tethemeliō-menoi*) అను పదము కొలొస్సయులు కట్టబడినవారైయుండిరి గనుక వారు అదే స్థితిలో కొనసాగుచుండవలసినవారై యున్నారని సూచించుచు, గ్రీకులో అదొక సంపూర్ణమైన అసమాపక క్రియయై యున్నది. ఒక కట్టడ నిర్మాణము నిమిత్తము అవసరమైయున్న మౌలిక సరుకును, ఉదా॥ ఒక ఇంటి పునాది లేక నేలను సమకూర్చుట గూర్చి అది సలహా ఇచ్చుచున్నది (మత్తయి 7:25; హెబ్రీయులకు 1:10). దీనినే ఆధ్యాత్మిక దృష్టికోణంలో చూచినట్లయితే, అది ఒకని అధ్యాత్మిక జీవితమునకు భద్రతను సమకూర్చు పునాదిని సూచించుచున్నది (ఎఫెసీయులకు 3:17).

"స్థిరులునై" (*hedraioi*) – వారు అచంచలముగా అమర్చబడియున్నారను అభిప్రాయమును ఈ పదము వ్యక్తముచేయుచున్నది. "కట్టబడినవారై స్థిరముగా ఉండి" అను పదజాలము, అధునాతన పద్ధతుల్లో అంగరంగవైభవంగా గట్టి పునాదిపై నిర్మింపబడిన పదంతస్తుల భవంతి యొక్క స్థిరత్వమునకు ఒక పరోక్ష పోలికయై యుండవచ్చును. యేసు ప్రబోధములకు విధేయులగువారు కదల్చబడజాలని పునాది మీద కట్టబడినవారై యున్నారు, పరీక్షింపబడుచుండు పరిస్థితుల్లో వారు పడిపోకుండా స్థిరంగాను సురక్షితంగాను నిలిచియుందురు (మత్తయి 7:24–27). మన అధ్యాత్మిక బండ ఆయనే (1 కొరింథీయులకు 10:4). సంఘము కట్టబడినది ఆయన మీదనే (మత్తయి 16:18); మరొక పునాది లేదు (1 కొరింథీయులకు 3:11).

"తొలగిపోక" – బలమైన గాలులు భయంకరముగా వీచుచుండగాను, అల్లకల్లోలమును సృష్టించు అలలు దాని మీద పడుచుండినను లంగరువేయబడి కదలకుండా ఒకే చోట నిలిచియుండు ఓడనుబట్టి ఈ పదము చిత్రీకరింపబడవచ్చును. వారు ప్రతి విధమైన ప్రబోధముల చేత కొట్టుకొనిపోకూడదని పౌలు ఎఫెసీయులకు ఉపదేశించాడు (ఎఫెసీయులకు 4:14). కొలొస్సీలోని సహోదరులు సువార్తలో కనుగొన్న "నిరీక్షణ" గూర్చి ఆయన కొలొస్సయులకు 1:5లో పెర్కొన్నాడు. వారు విశ్వాసములో నిలుకడగా కొనసాగినట్లయితే, ఈ నిరీక్షణ తెచ్చిపెట్టు గొప్ప బహుమానమేమిటో వారు గ్రహించగలిగారు. ఈ సహోదరులు వారి బోధల ప్రకారమే చేయునట్లు ఒప్పించుటకు అబద్ధ బోధకులు ప్రయత్నించవచ్చును (కొలొస్సయులకు 2:8); కానీ వారు దేవుని సంతోషపరచునట్లు, కొలొస్సయులు యేసు యొక్క బోధలను అనుసరించవలసి యున్నది.

### "... మీరు విన్నట్టియు, ... ప్రకటింపబడినట్టియు, పౌలు నేను పరిచారకుడనైనట్టియు" (1:23)

ఆ బోధ **మీరు విన్నట్టి సువార్తయై యుండినది. అది ఆకాశము క్రింద నున్న సమస్త సృష్టికి ప్రకటింపబడినది, దాని కొరకు పౌలను నేను పరిచారకుడనైతిని.** కొలొస్సీ పత్రికలో పౌలు "నేను" (ఉత్తమ పురుష, ఏక వచనము) అని ప్రయోగించుట ఇదే మొదటిసారి, అనగా ఈ పత్రిక రచయిత ఆయనే అని తద్వారా ప్రస్తావించుచున్నాడు.

ఎపఫ్రా ద్వారా ప్రకటింపబడిన సువార్త కొలొస్సయులు “విన్నారు” (1:7). ఆయన వారికి బోధించిన సువార్త దేవుని సందేశకులు ప్రతి చోట ప్రకటించుచుండిన అదే సువార్తయై యుండినది (మార్కు 16:15). క్రీస్తు సందేశము సమస్త జనులకు, వారు యూదులైనను మరియు అన్యజనులైనను, అందరికి అదొక్కటే (అపొస్తలుల కార్యములు 15:11; రోమీయులకు 1:16; 2:6–11). క్రైస్తవులందరికిని అవే ఆపేక్షితాలు, నిర్బంధములు, స్వేచ్ఛలు, వాగ్దానములు, మరియు ఆశీర్వాదములు వర్తించును.

సువార్త యొక్క గొప్ప సందేశము “ఆకాశము క్రింద ఉన్న సమస్త సృష్టికి” ప్రకటింపబడినది (వచనం 23). 1:6లో వలెనే, “సమస్త” అనగా, సాధ్యమైనదంతా కాదు కానీ రచయిత భావించుచుండిన వర్గములోని ప్రతి ఒక్కరు అని అర్థము. విశాల అర్థము, విశాల ప్రపంచములోని ప్రతి ప్రాంతములో సువార్త ప్రకటింపబడినదని పౌలు భావించలేదు. లూకా 2:1–3లో వ్రాయబడి యున్నట్లుగా, సర్వ లోకమునకు ప్రజాసంఖ్య వ్రాయవలెనని రోమా ప్రభుత్వము చేత ఒక ఆజ్ఞ జారీచేయబడినది, గనుక “ప్రతి ఒక్కరు” ఆ సంఖ్యలో వ్రాయబడవలసి వచ్చినది. రోమా ప్రభుత్వము క్రింద నుండిన వారు మాత్రమే ప్రజా సంఖ్యలో వ్రాయబడ్డారు, కానీ ప్రపంచమందంతటను ఉన్నవారు కాదు. ఏలీయా కాలములో వ్యాపించియుండిన కరువుకాటకం “దేశమందంతటను” వ్యాపించియుండినట్లు తెలియజెప్పబడుచున్నది (లూకా 4:25–26), అనగా ఇశ్రాయేలు దేశమందంతటను అని అర్థము. “సమస్తము” అను పదము తరుచుగా దాని అవకాశములో పరిమితమైనదై యున్నది. యూదులు మాత్రమే గాక ఇతరులకును సువార్త ఉపదేశింపబడినదని ఇచ్చట వాడబడిన “సమస్త సృష్టి” అను పదజాలము తెలియజెప్పుచున్నది; ప్రకటింపబడుచుండిన సువార్త సందేశములను వారు వినవలెనని అన్యజనులు సహితము ఆహ్వానింపబడ్డారు.

పౌలు ఈ క్రీస్తు సువార్తకు “పరిచారకుడు” (*diakonos*) అని తనను గూర్చే ప్రస్తావించుకొనుచున్నాడు. 1:7లో ఎపఫ్రా విషయములో కూడ ఆయన ఇదే పదమును ఉపయోగించాడు, అయితే అక్కడ అది “దాసుడు” అని అనువదింపబడినది.

క్రీస్తు సువార్త యొక్క యథార్థమైన పరిచారకుడుగాను దాసుడుగాను, ఆయన ఉపదేశించుచుండిన సందేశముయొక్క సార్వజనీకతను కొలొస్సయులు అర్థంచేసికొనవలెనని పౌలు ఆశించాడు. సువార్త సందేశము ఒక ప్రదేశమునకు పరిమితమైనది కాదు కానీ అది సమస్త దేశములయందున్న సకల జనులకొరకైనదై యున్నది.

## అన్వయము

### క్రీస్తు ద్వారా సమాధానపరచబడుట

ఇరువురి మధ్య కొన్ని పర్యాయములు సంఘర్షణలు చోటుచేసికొనును, తత్ఫలితంగా వారిరువును వేరగుదురు. ఇతర సందార్భాల్లో, ఒకడు మరొకని మనస్సు గాయపర్చును, గనుక గాయపడినవాడు వాని నుండి తప్పుకొనును. కాబట్టి ఇటువంటి పరిస్థితుల్లో విడిపోయినవారు మరలా ఒక్క చోటికి వచ్చునట్లు సమాధానపడుట అత్యావశ్యకమై యున్నది.

పాపము ద్వారా, మానవ జాతి దేవుని మనస్సును గాయపర్చినది, గనుక అది వానిని ఆయన నుండి వేరుచేసినది. ఇటువంటి పరిస్థితుల్లో సమాధానపరచబడుట అగత్యమై యున్నది. సమాధానపరచబడుటలో మూడు పక్షములకు చెందినవారున్నారు: తప్పిదము చేసినవాడు, తప్పిదము చేయబడినవాడు, మరియు మధ్యవర్తి. మానవుని పాపమువలన తలెత్తినయుండిన తెగిపోయిన సంబంధమును దేవుడు ముందుగానే దృష్టించాడు గనుక, ఆయన బాగా ఆలోచించి సమాధానపరచబడుటను సాధ్యంచేయు ఒక ప్రణాళిక సిద్ధంచేసాడు.

*నేరస్థుడు, మానవుడు.* ఆదాము మరియు హవ్వ పాపము చేసినప్పటి నుండి, వారి సంతతివారందరును పాపం చేశారు గనుక వారు దేవుని మహిమను పొందుకొనలేకపోవుచున్నారు (రోమీయులకు 3:23). దేవుని మార్గములు యెడల చేయబడు తిరుగుబాటునకు పర్యవసానముగా మనము ఆయన నుండి వేరుచేయబడుదుము. ఆయన వెలుగై యున్నాడు, ఆయనలో చీకటి ఎంతమాత్రమును లేదు (1 యోహాను 1:5). పాపాంధకారములో నడుచుకొనుచుండువారు ఆయనతో కూడ సహవాసము కలిగియుండలేరు (1 యోహాను 1:6). దేవుని నుండి మనలను వేరుచేయునది మన పాపములే (యెషయా 59:1, 2). క్షమింపబడని పాపులు దేవునికి దూరస్థులై (ఎఫెసీయులకు 2:13) వారి దుష్క్రియల వలన దేవుని నుండి అన్యాక్రాంతము చేయబడియున్నారు (కొలొస్సయులకు 1:21).

*భాదింపబడిన వాడు, దేవుడు.* నీతిని ప్రేమిస్తాడు గనుక ఆయన పాపమును ద్వేషిస్తాడు (హెబ్రీయులకు 1:9). ఆయన ఉగ్రత సమస్త భక్తిహీనతకు విరోధముగా నున్నది (రోమీయులకు 1:18). తమ్మునుతాము దుర్మార్గమునకు అప్పగించుకొనువారిని ఆయన ద్వషిస్తాడు (కీర్తనలు 5:5; 11:5), వీరిలో అబద్ధ సాక్షులు మరియు సహోదరుల నడుమ ద్వేషభావమును వ్యాపింపజేయువారు కూడ ఉన్నారు (సామెతలు 6:16-19). దేవుడు వారిని ద్వేషించునంతగా మానవులు ఆయనకు విరోధముగా తిరుగుబాటు చేయుచున్నారు.

దేవుడు న్యాయవంతుడును పరిశుద్ధుడునై యున్నాడు గనుక, పాపము శిక్షింపబడకుండా ఆయన అనుమతించజాలడు. ఎవడైనా ఒకడు మరొకరి ఇంటిలోనికి చొరబడి కుర్చీలను బల్లలను విరగగొట్టుచు, నేలంతటిని పాడుచేయుచు, ఇతర వస్తువులను ధ్వంసముచేసినట్లయితే, వాడు చేసిన తప్పు సరిదిద్దబడవలెనని న్యాయము కోరును. అనగా, భాదింపబడిన వానికి ధ్వంసము చేయబడిన వస్తువుల వెల చెల్లించవలసియుండునని అర్థము.

పాపము దేవుని మనస్సును గాయపర్చును. దేవుని న్యాయస్థానములో, పాపమునకు తగిన న్యాయమైన శిక్ష, మరణమే (రోమీయులకు 6:23). అందరును మరణించవలసినవారే, ఏలయనగా అందరును పాపముచేసి దేవుని నీతిని సంతృప్తిపరచు స్థాయిలో జీవించలేదు (రోమీయులకు 3:23). దేవుని మనస్సును గాయపర్చునదేమైయున్నదో, తత్ఫలితంగా మరణమును ప్రాప్తింపజేయునదేమిటో గ్రహించవలెనంటే, ఆయన ఏ యే విషయాలను పాపముగా ఎంచునో అది మనము తెలిసికొనవలసి యున్నది. చేయుటకు ప్రశ్నార్థకమైన పనులలో మనము నిమగ్నమగుట ద్వారా మనము పాపము చేయువారమగుదుము (రోమీయులకు 14:23 చూడుము); చట్టము యొక్క పరిమితులకు అవల పనులు చేయుట ద్వారా (1 యోహాను 3:4); దుర్నీతిమయమైన కార్యకలాపములలో కాలుమోపుట ద్వారా (1 యోహాను 5:17); లేదా చేయవలెనని మనమెరిగియున్న మంచి పనులను చేయకపోవుట

ద్వారా (యాకోబు 4:17) మనము పాపము చేయుచున్నవారమగుదుము.

పాపమును దేవుని ప్రమాణముల ప్రకారము కొలుచునప్పుడు, “లేదు, నీతిమంతుడు లేడు, ఒక్కడును లేడు” (రోమీయులకు 3:10) అని ఒప్పుకొనుటలో మనము దేవునితో ఏకీభవించవలసి యుండును. అనగా మనమందరమును దేవునికి విరోధముగా తప్పిదములు చేసినవారమే అని దీని అర్థము. మనలో పాపము లేదనిగాని, మనము పాపము చేయలేదనిగాని మనము చెప్పుకొనినయెడల, మనలను మనమే మోసపుచ్చుకొందుము మరియు మనము దేవుని అబద్ధికునిగా చేయుదుము (1 యోహాను 1:8, 10). పాపముల వలననే, దుర్నీతిపరులమై యున్నాము. మనలో మంచి ఏమియును లేదు. మనము చేసిన పాపములను సరిదిద్దుకొనుటకు మనము చేయవలసినది మరియు చేయగలిగినది కూడ ఏమియును లేదు (ఎఫెసీయులకు 2:8, 9).

*మనకు మధ్యవర్తి, యేసు* (1 తిమోతి 2:5). మనకును దేవునికిని మధ్యవర్తియై, దేవునితో కూడ మనకు స్నేహపూర్వక సంబంధము కలుగజేయగలవాడు, యేసు ఒక్కడే ఏలయనగా: ఆయన మానవునితోను దేవునితోను సమాన సంబంధము కలిగియున్నాడు, మరియు ఆయన మానవునికిచ్చు విలువ మానవజాతినంతటిని తలదన్నునదై యున్నది.

(1) ఆయన మనలను అర్థంచేసికొని మన పక్షమున మధ్యవర్తిత్వము చేయగలుగునట్లు యేసు మానవుడయ్యాడు. ఆయన “కనికరమును నమ్మకమునుగల ప్రధాన యాజకుడగునట్లు” మనవంటి వాడయ్యాడు (హెబ్రీయులకు 2:17). ఆయన “మన వలెనే శోధింపబడినను, ఆయన పాపము లేనివాడుగా ఉండెను” గనుక ఆయన మన బలహీనతలవలన మనస్సు కరిగినవాడై మనకు సహాయము చేయుచున్నాడు (హెబ్రీయులకు 4:15). ఆయన మానవుడు కానట్లయితే, మన దురవస్థను ఆయన అర్థంచేసికొనలేక మన పక్షమున న్యాయసమ్మతముగా మధ్యవర్తిత్వము చేయలేకపోవును.

(2) ఆయన దేవత్వమైయున్నాడనగా ఆయన తండ్రితో సమానత్వము గలవాడై యున్నాడనియు; ఆయనను మన మధ్యవర్తిగా తండ్రి అంగీకరించుననియు అర్థము. యేసు ఒక వైపు మానవునితోను మరొక వైపు దేవునితోను సమాన సంబంధము కలిగియున్నాడు. శరీరధారియగుట చేత (యోహాను 1:14) ఆయన మనుష్యకుమారుడయ్యాడు (మత్తయి 9:6). అదే సమయంలో ఆయన దేవుని కుమారుడై యున్నాడు (లూకా 1:35). ఆయన మానవునికిని దేవునికిని మధ్య న్యాయసమ్మతముగా మధ్యవర్తిత్వము చేయగలడు.

(3) మానవుని పాపమును ఆయనే వహించి ఆ పాపమువలన వచ్చు జీతమైన మరణశిక్షను భరించుట ద్వారా దేవునికిని మానవునికి మధ్య స్నేహము ఏర్పరచాడు. దీనిని సాధించుటకు ఆయన పాపరహితుడై యుండవలసి వచ్చినది. పాపరహితుడైన మనుష్యకుమారునిగాను దేవుని కుమారునిగాను, మనము నీతిమంతులముగా తీర్చబడునట్లు మన పాపములను ఆయన తానే భరించాడు (1 కొరింథీయులకు 15:3; 2 కొరింథీయులకు 5:21; 1 పేతురు 2:24; 3:18).

(4) యేసు, లోక పాపమును మోసికొనిపోవు దేవుని గొఱ్ఱెపిల్లయై యున్నాడు (యోహాను 1:29). ఒకని మరణము, ముఖ్యముగా ఒక పాపి మరణము, సమస్త మానవుల పాప విమోచన నిమిత్తము క్రయధనముగా చెల్లించజాలదు. ఇందుకు మినహాయింపు కలిగించవలసి యున్నట్లయితే, అందుకు ఎవరో ఒకరు సమానమైన లేదా సమస్త మానవుల కంటే అధిక

విలువ చెల్లించగలవాడుండవలెను. యేసు ఇటువంటివాడై యుండెను. ఏలయనగా ఆయన లోకములోని సమస్త మానవుల కంటే ఎక్కువ విలువైనవాడై యుండెను; కాబట్టి, ఆయన సమస్త మానవుల పాపములను తానే భరించి మన పాప ఋణమును చెల్లించగలిగెను. ఆయన తన మరణము ద్వారా క్షమింపబడు మార్గమును సరాళము చేసాడు. మనము దేవుని స్నేహితులమై యుండి ఆయనతో సమాధానపరచబడినవారమై యుండు సౌకర్యమును ఆయన సమకూర్చాడు.

(5) సిలువ మీద చిందింపబడిన రక్తము ద్వారా, మనము దేవునితో సమాధానముగలవారమై యుండునట్లు యేసు మన కొరకు ఒక మార్గమును సమకూర్చాడు (1:19-20), మనము దేవుని యెదుట పరిశుద్ధులముగాను, నిర్దోషులముగాను మరియు నిరపరాధులముగాను నిలువబడుటకు సామర్థ్యమును కలుగజేసాడు (1:22). సంఘమునకు, రక్షణ నొందినవారి శరీరమునకు, కూడ ఇదే వాగ్దానము ఈయ్యబడినది (ఎఫెసీయులకు 5:23-27).

మనము తప్పిదముచేసినవారమై, పాపులమై, యున్నాము మరియు మన పాపముల మూలమున దేవుడు తన మనస్సు గాయపరచబడినవాడై యున్నాడు. మనము పాపముతో కలిగియున్న స్నేహము వలన, మనము దేవునికి శత్రువులమగుచున్నాము (యాకోబు 4:4); కానీ దేవునితో కలిగియుండగల స్నేహపూర్వక సన్నిహితమును యేసు సమకూర్చాడు. ఆయన లోకము యెడల కలిగియున్న ప్రగాఢమైన ప్రేమనుబట్టి (యోహాను 3:16), దేవుడు దీనిని యేసుక్రీస్తు ద్వారా సమకూర్చాడు (2 కొరింథీయులకు 5:18, 19).

మనము ఆయనతో సమాధానపరచబడగలుగునట్లు, ఆయన చేయవలసియుండినవియు, చేయవలెననియు ప్రణాళిక వేసికొనిన సకల కార్యములను దేవుడు సంపూర్తిగా చేసాడు. సమాధానపరచు వాక్యము ద్వారా సమాధానపరచబడుట గూర్చిన తెలివిని ఆయన మనకు ఒసగాడు, మన అతిక్రమములు యిక మీదట మనకు విరోధముగా నిలిపియుంచబడవలసిన అవసరం లేదని అది మనకు బయలుపర్చుచున్నది (2 కొరింథీయులకు 5:19). ఏదిఏమైనా, సమాధానపరచబడుట మన నుండి ప్రతిస్పందనను కోరుచున్నది. దీనిని గ్రహించినందువలననే, పౌలు ఇలా విన్నవించుకొనుచున్నాడు: “దేవునితో సమాధానపడుడని క్రీస్తు పక్షముగా మిమ్మును బతిమాలుకొనుచున్నాము” (2 కొరింథీయులకు 5:20).

(6) దేవుడు మరియు మానవుడు స్నేహపూర్వకముగా యేసుక్రీస్తునందు, సమాధనపరచబడగల స్థలమందు, కలిసికొనగలరు. “దేవుడు, ... క్రీస్తునందు లోకమును తనతో సమాధానపరచుకొనుచున్నాడు” (2 కొరింథీయులకు 5:19). మనము దేవుని కలిసికొని ఆయన స్నేహితులమై యుండునట్లు క్రీస్తునందుండవలెను. మనము బాప్తిస్మము ద్వారా క్రీస్తు లోనికి ప్రవేశించుదుము (రోమీయులకు 6:3; గలతీయులకు 3:26, 27). మనము క్రీస్తునందు నిలిచియుండునట్లు, ఆయన ఆజ్ఞలను గైకొనవలెను (1 యోహాను 2:3-5).

మనలో ఏ ఒక్కరమును నీతిమంతులము కాదు. మన పాపము మనలను దేవుని నుండి వేరుచేయుచున్నవి. ఈ హేతువునుబట్టియే క్రీస్తు మన మధ్యవర్తి, మనకు అగత్యమై యున్నాడు. ఆయన ఎవరైయున్నారో అను దానిని బట్టి యేసు సమాధానపరచబడుటను సమకూర్చుచున్నాడు.

**సమాధానపరచబడుట మరియు క్రీస్తు యొక్క సర్వసంపూర్ణత (1:20)**

క్రీస్తునందు నివసించుచున్న సర్వ సంపూర్ణత యొక్క అత్యంత గొప్పదైన మేలు, బహుశా సమాధానపరచబడుటయై యుండును. పాపము వలన, మానవ జాతి పరిధిలో నున్న ప్రతి ఒక్కడు, దేవుని నుండి వేరుచేయబడినవాడై యున్నాడు (రోమీయులకు 3:10, 23). వారి పాపములలోనే మృతిచెందువారు యేసుతో కూడ ఉండజాలరు. యేసు మరణము ద్వారా సమాధానపరచబడుటను సమకూర్చవలెననునది సృష్ట్యాదికి మునుపే దేవుని ప్రణాళికయై యుండినది.

యేసు నందలి సర్వసంపూర్ణతనుబట్టి సమాధానపరచబడుట సాధ్యమౌతుంది (వచనం 20). ఆయన సిలువ మీద చిందించిన రక్తము ద్వారా సమాధానము అందుబాటులో ఉండు ఏర్పాటు చేయబడినది (వచనం 20). రక్తము చిందింపబడుట ద్వారా మాత్రమే పాపము క్షమింపబడవచ్చునని దేవుడు ఆజ్ఞ ఇచ్చాడు (హెబ్రీయులకు 9:22). జంతువుల రక్తము పాపమును తీసివేయుట అసాధ్యము (హెబ్రీయులకు 10:4). దేవుని సన్నిధి లోనికి గల ప్రవేశమును యేసు రక్తము మాత్రమే సమకూర్చును (హెబ్రీయులకు 10:19, 20).

దేవుని నుండి వేరైయున్నవారందరును, ఆయన రక్తము ద్వారా సమాధానపరచబడుటకు యేసు ఒక సదవకాశమును సమకూర్చాడు. పాపములు తొలిగింపబడినప్పుడే సమాధానపరచబడుట సాధ్యమౌతుంది. వ్యాపారములో అతనితో భాగస్వామియై యున్నవాడు వారి వ్యాపారాభివృద్ధికై సమకూర్చుటకు సహకరించడు, సహాయము చేయడు గనుక ఒక వ్యాపారవేత్త వాని భాగస్వామ్యమును విలీనము చేయవచ్చును. భాగస్వామి సోమరివాడై పనిచేయనంత కాలము, వానితో వ్యాపారము చేయుటకు అతని సహచారి తృణీకరించవచ్చును వాడు సరిగా పనిచేయుచు అప్పు తిరిగి చెల్లించినట్టయితే వాని భాగస్వామ్యము పునరుద్ధరింపబడవచ్చును. మన పాప ఋణమును యేసు చెల్లించి తద్వారా దేవునితో స్నేహపూర్వకమైన సంబంధమును సమకూర్చాడు.

**సమాధానపరచబడుట మరియు వైరభావము (1:21)**

దైవభావముతో కూడిన మనస్సుగలవారు దేవుని చిత్త ప్రకారము చేయకుండుటకు ఎన్నుకొందురు. వారి హృదయములు మొండివి మరియు అవి మారుమనస్సునొంద ఇష్టపడనివై యున్నవి; అవి “భేదములు పుట్టించి, సత్యమునకు లోబడక, దుర్నీతికి లోబడునవై యున్నవి” (రోమీయులకు 2:5, 8). ఒకడు వానికిని దేవునికిని నడుమ పాపమును నిలిచియుండనిచ్చినంత కాలము, వాడు దేవునికి శత్రువై యుండును (యాకోబు 4:4).

ప్రజలు దుష్క్రియలు చేయుటలో నిమగ్నమై యున్నప్పుడు వారు దేవుని నుండి వేరుచేయబడినవారై యుందురు. దేవుని చిత్త ప్రకారము చేయుటకు విఫలులమగుట వలన మనము ఆయన దృష్టికి చెడ్డవారమౌదుము. దేవుడు నీతిని ప్రేమించును గనుక అతిక్రమమును ద్వేషించును (హెబ్రీయులకు 1:9).

ఏ తల్లైనా తన బిడ్డను ప్రగాఢంగా ప్రేమిస్తుంది. ఏదిఏమైనా, ఆ బిడ్డ తల్లికి ప్రియమైన ప్రతి వస్తువును తన కాళ్లతో తొక్కుట ద్వారా ఎడతెరిపిలేకుండా తల్లి హృదయాన్ని బ్రద్దలు చేయుచు, ఆమె మనస్సుకు నొప్పి కలిగించుటకు బిడ్డ కొనసాగినంత కాలము, ఆమెకు

బిడ్డకు ఎటువంటి సంబంధముగాని పట్టింపుగాని ఉండదని ఆమె తన బిడ్డకు తెలియజేప్పుట ద్వారా తన అసంతుష్టిని వ్యక్తము చేయవచ్చును. దేవుడు పాపము పట్ల కలిగియున్న అనుభూతి ఎంతో తీవ్రమైనదై యున్నది. దేవునికి లోబడనివారు ఇట్టి తిరుగుబాటుతనముతో తమ్మునుతామే ఆయన నుండి వేరుచేసికొనుచున్నవారౌదురు.

**సమాధానపరచబడుట మరియు నూతనముగా సృష్టింపబడుట (1:22, 23)**

యేసు క్రీస్తు ద్వారా సమాధానపరచబడుట మనలను పరిశుద్ధులనుగాను, నిర్దోషులనుగాను మరియు నిరపరాధులనుగా చేయును (వచనం 22). ఒక గ్లాసు నీళ్లలో ప్రాణాంతకమైన రోగాణువు ఒక్కటే ఉండవచ్చును, కానీ అది ఆ గ్లాసులోని మొత్తము నీళ్లను త్రాగకూడని నీళ్లుగా పాడుచేయును. అదే విధంగా, పాపము కేవలము ఒక్క భాగమును/అవయమును కలుషితము చేయదు, కానీ ఆత్మను మొత్తంగా కలుషితం చేయును. ఆధ్యాత్మికముగా కలుషితమైనవారు పరలోక రాజ్యములో ప్రవేశింపనేరరు (ప్రకటన 21:27). ఆయన మరణము ద్వారా, తీర్పు దినాన మనము ఆయన యెదుట నిర్దోషులముగా నిలువబడగలుగునట్లు యేసు సమస్త పాపములు తొలగింపబడు ఏర్పాటును సమకూర్చాడు.

టైపు చేయుచుండువాడు ఎన్నో తప్పులు టైపుచేయవచ్చును, కానీ ప్రతి తప్పు సరిదిద్దబడినట్లయితే, ఆ పుట అంతా తప్పులేమియు లేనిదౌతుంది. ఆయన సిలువ మీద చిందించిన రక్తము ద్వారా యేసు మన జీవితములను పాపములేని జీవితములాగా పరివర్తనము గావింపగలడు. ఒకసారి క్షమింపబడిన పాపములు, యిక ఎన్నటికిని జ్ఞాపకము చేసికొనబడవు (హెబ్రీయులకు 8:12). సంఘము, యేసు తనకుతానే తన యెదుట నిలువబెట్టుకొను ఏ పాపములేని ప్రజాశరీరమై యున్నది (ఎఫెసీయులకు 5:25–27). ఆయన ఈ కార్యము చేయగలడు ఎందుకనగా సంఘమును వాక్యముతో కడుగుట ద్వారా శుద్ధీకరించునట్లు ఆయన తనను తానే అర్పించుకొన్నాడు. దానిలో వ్రాయబడిన దానికి సరిపడు మొత్తము బ్యాంకులో ఉంటే తప్ప ఏదైనా ఒక బ్యాంకు చెక్‌కు ఎటువంటి విలువ ఉండదు. అలాగే, అవి ప్రజలను వారి పాపము నుండి శుద్ధీకరించుటకు నీళ్లకు మరియు వాక్యమునకే శక్తి ఉండదు; కానీ యేసు రక్తములో గల శక్తి మూలముననే వాటి ద్వారా మానవులు క్షమింపబడుదురు.

విశ్వాసమందు స్థిరముగా కొనసాగుచుండువారు (వచనం 23) పరిశుద్ధులుగాను, నిర్దోషులుగాను మరియు నిరపరాధులుగాను నివేదింపబడుదురు. ఈ వాగ్దానము మనము యేసు యెడల విశ్వాసనీయమైనవారముగా నిలిచియుండుటపై ఆధారపడియున్నది. ఆయన పెండ్లికుమారుడై యున్నాడు; సంఘములోని, అనగా క్రీస్తు యొక్క పెండ్లికుమార్తెయై యున్న సంఘములోని ప్రతి సభ్యుడు, పెండ్లికుమార్తెకు తన భర్తతో గల సంబంధము వలెనే, యేసుతో సంబంధము కలిగియున్నాడు. అవిశ్వాసియైన భార్యను తన భర్త విడనాడవచ్చును (మత్తయి 19:9), అలాగే ఆయన యెడల అవిశ్వాసులై యుండు క్రైస్తవులతో యేసు తన సంబంధమును తెంచివేసికొనును (యోహాను 15:4–6). యేసు రక్తము పరిపూర్ణము చేయు శక్తి కలిగియున్నందునుబట్టి, విశ్వాసమందు స్థిరముగా కొనసాగుచుండువారు, ఒక పెండ్లికుమార్తె పెండ్లికుమారుని చేత అమితానందముతో స్వీకరింపబడినట్లుగా వారిని స్వీకరించునని నమ్మవచ్చును.

**విశ్వాసమందు నిలిచియుండుము (1:23)**

మనము దేవుని యెదుట నిర్దోషులముగా నిలువబెట్టబడి నివేదింపబడుట యేసు చేసిన కార్యము మరియు విశ్వాసనీయతపై ఆధారపడియున్నది. మనము దేవునితో కలిగియుండు స్థానము షరతుతో కూడినదైయున్నదని సూచించుటకు పౌలు "... యెడల" అను పదమును ఉపయోగించాడు (వచనం 23). మనము రక్షింపబడవలెనంటే, మన విశ్వాసమును కాపాడుకొనవలసియున్నదని మనము గ్రహించునట్లు యేసు మరియు క్రొత్త నిబంధన రచయితల చేత నానావిధములైన హెచ్చరికలు ఇవ్వబడినవి.

మనము దేవుని సకలాశీర్వాదములను పొందుకొనుటకు ...

- ఆయన శిష్యులమై యుండి, స్వతంత్రులముగా చేయబడునట్లు సత్యమును తెలిసికొనుటకు యేసు మాటలయందు నిలిచియుండవలెను (యోహాను 8:31, 32).
- యేసునందు నిలిచియుండి ఆయన నిమిత్తము బహుగా ఫలించవలెను (యోహాను 15:2-6).
- ఆయన ప్రేమయందు నిలిచియుండునట్లు యేసు ఆదేశించిన ఆజ్ఞలను గైకొనవలెను (యోహాను 15:9, 10).
- మహిమ, ఘనత మరియు నిత్యజీవమును పొందుటకు విసుకక మేలుచేయుచుండవలెను (రోమీయులకు 2:7).
- దేవుని అనుగ్రహమునందు నిలిచియుండవలెను (రోమీయులకు 11:22).
- పరిశుద్ధులముగాను, నిర్దోషులముగాను మరియు నిరపరాధులముగాను నిలువబెట్టబడునట్లు విశ్వాసమందు నిలిచియుండవలెను (కొలొస్సయులకు 1:22, 23).
- రక్షణ గూర్చిన అభయము కలిగియుండునట్లు యేసు క్రీస్తు బోధలయందు నిలుకడగా ఉండవలెను (1 తిమోతి 4:16).
- ఆయన గృహముగా ఎంచబడునట్లు మన విశ్వాసమును మరియు నిరీక్షణను నిశ్చలముగా పట్టుకొని యుండవలెను (హెబ్రీయులకు 3:6).
- క్రీస్తు నందు పాలిభాగస్థులమై యుండునట్లు మన అభయమును అంతము వరకు నిశ్చలముగా పట్టుకొని యుండవలెను (హెబ్రీయులకు 3:14-16).
- ఆశీర్వదింపబడునట్లు స్వతంత్రము నిచ్చు నియమమునందు నిలిచియుండవలెను (యాకోబు 1:25).
- తండ్రి మరియు కుమారుని కలిగియుండునట్లు యేసు నిలిచియుండవలెను (2 యోహాను 9).

తప్పిపోకుండుటకు తగు జాగ్రత్తలు వహించవలెనని కూడ మనము హెచ్చరింపబడి యున్నాము. విత్తువాని గూర్చిన ఉపమానములో శోధనల మూలమున తప్పిపోవు విషయాన్ని యేసు పేర్కొన్నాడు (లూకా 8:13). ఆయన అనర్హుడుగా ఎంచబడకుండునట్లు పౌలు తన శరీరమును నలగగొట్టుకున్నాడు (1 కొరింథీయులకు 9:27). పడిపోవుటకు విరోధముగా హెచ్చరించునట్లు ఆయన ఇశ్రాయేలు ప్రజలను ఒక ఉదాహరణముగా పేర్కొన్నాడు

(1 కొరింథీయులకు 9:27). పడిపోవుటకు విరోధముగా హెచ్చరించునట్లు ఆయన ఇశ్రాయేలు ప్రజలను ఒక ఉదాహరణముగా పేర్కొన్నాడు (1 కొరింథీయులకు 10:6–12; హెబ్రీయులకు 4:11). వారు యేసు వైపు మరలా తిరుగలేనంతగా క్రైస్తవులు పడిపోవుటకు అవకాశములు కలవు (హెబ్రీయులకు 6:6).

మనము దేవుని కృప (గలతీయులకు 5:4) మరియు మన విశ్వాసము (1 తిమోతి 4:1) నుండి పడిపోగలమని లేఖనములు మనకు ప్రబోధించుచున్నవి. మనము పూనుకొనిన "ప్రతిజ్ఞ"ను ప్రక్కనబెట్టుట మనము పడిపోవు విధానములలో మరొకటై యున్నది (1 తిమోతి 5:11–12). మనము సత్యములో స్థిరముగా నిలిచియుండి దాని నుండి పెడదారిపట్టకూడదు.

మనము దేవుడిచ్చు బహుమానమును పొందునట్లు అంతము వరకు సహించుచు (మత్తయి 24:13), విసుకుచెందక యుంటూ (గలతీయులకు 6:9), మన రక్షణను కొనసాగించుచు (ఫిలిప్పీయులకు 2:12), యేసునకు విధేయులమై యుంటూ (హెబ్రీయులకు 5:8–10), మరణము వరకు నమ్మకముగా నిలిచియుంటూ (ప్రకటన 2:10), దేవుని చిత్తమును నెరవేర్చుచున్నవారమై యుండవలెను (1 యోహాను 2:15–17). మన పేర్లు జీవగ్రంథములో నుండి తుడుపువేయబడుటను నిరోధించునట్లు (ప్రకటన 3:5) మనము మన జీవితములో ఎదురయ్యే దౌష్ట్యములను జయించవలెను. జీవగ్రంథములో ఎవరి పేర్లైతే వ్రాయబడియుండవో వారు అగ్నిగుండములోనికి త్రోసివేయబడుదురు (ప్రకటన 20:15).

క్రైస్తవులు తొట్రిల్లపోయి నశించిపోయినవారు కాకుండునట్లు తమ్మునుతాము తగు జాగ్రత్తగా కాపాడుకొనుచుండవలెను. నిత్య రాజ్యములోనికి ప్రవేశము కలదను అభయమును కలిగియుండుటకు, మనము మన విశ్వాసమునకు కొన్ని నిశ్చయమైన సద్గుణములను చేర్చుకొనుచుండవలెను (2 పేతురు 1:5–11). మనము వీటిని కలిగియుండి వీటి ప్రకారము చేసినట్లయితే, మనమెన్నడును తొట్రిల్లి కూలిపోము.

మనకు విరోధముగా ఏ నిందయు మోపబడకుండా మనము దేవుని యెదుట నిలువబెట్టబడునట్లు యేసు సమస్తమును సాధ్యంచేసాడు. ఏదిఏమైనా, ఆయన దీనిని చేయుటకు, మనము మన విశ్వాసములో స్థిరముగా నిలిచియుండవలెను. మనము మన జీవితములో దేవుని మార్గమును అనుసరించనట్లయితే, మనము పనికిరాని తీగెల వలె తీసి పారవేయబడుదుము; మనము ఆయనను అనుసరించినట్లయితే, మనమెన్నడును తొట్రిల్లము (యోహాను 15:6; రోమీయులకు 11:22).

---

సూచనలు

[1]David M. Hay, *Colossians,* Abingdon New Testament Commentaries (Nashville: Abingdon Press, 2000), 68. [2]ఇదే భావముతో "విశ్వాసము" ఎఫెసీయులకు 4:5; ఫిలిప్పీయులకు 1:27–28; 2:17; 1 తిమోతి 1:2; 3:9; 4:1; 5:8; 6:10, 21; 2 తిమోతి 3:8; 4:7; తీతు 1:1, 13; హెబ్రీయులకు 12:2; యూదా 3తో సహా, ఇతరమైన నానావిధ వాక్యభాగములలో వాడబడినది.